క్లుప్తంగా

పేకాట స్థావరంపై దాడి

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. శావల్యాపురం ఎస్‌ఐ లేళ్ల లోకేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని, వారినుంచి రూ.1,54,800లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరందరిపై కేసు నమోదు చేశామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

కరిముల్లాకు జీవన సాఫల్య పురస్కారం



వినుకొండ: వినుకొండ పట్టణానికి చెందిన ప్రసిద్ధ కవి కరిముల్లాకు ఈ నెల 20వ తేదీన హిందూపురంలో తిరుపతి వేంకట కవులు జీవన సాఫల్య పురస్కారం 2025 ప్రదానం చేయనున్నారు. ఈమేరకు ఆదివారం కవి కరిముల్లా ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ తెలుగు సాహిత్య అకాడమీ, సత్యసాయి జిల్లా రచయితల సంఘం, అఖిల భారత ఫ్రీడం ఫైటర్ షహీద్ టిప్పుసుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ సాజన్యంతో కార్యక్రమం జరగనుందని తెలిపారు. ముఖ్య అతిథులుగా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాల్ గౌడ్, ఉమర్ అలీషా, గజల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొననున్నారని తెలిపారు. జస్టిస్ వి.గోపాల్ గౌడ్ చేతుల మీదుగా తాను పురస్కారం అందుకోనున్నట్లు తెలిపారు.

నేడు వయ్యకల్లు ఊరచెరువు బహిరంగ వేలం

శావల్యాపురం: మండలంలోని వయ్యకల్లు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఊరచెరువు బహిరంగవేలం నేడు ఉదయం 11 గంటలకు జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి చింతా శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో సరైనా మద్దతు ధర రానందున వేలం వాయిదా పడినట్లు తెలిపారు. గ్రామంలోని రామాలయం వద్ద వేలం జరుగుతుందన్నారు. బహిరంగ వేలంలో పాల్గొనేవారు దరావత్తు రూ.25 వేలు చెల్లించాలన్నారు. తుది నిర్ణయం పంచాయతీ అధికారుల దేనన్నారు.

గురువు ప్రాధాన్యత తెలుసుకోవాలి



నాదెండ్ల: బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం వ్యాస పౌర్ణమి (గురు పౌర్ణమి) వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక సాయినాథ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో నందికుంట విఘ్నేశ్వరస్వామి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కె.సూరిబాబు అధ్యక్షత వహించారు. పీఆర్‌ఆర్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వ్యాస మహర్షి రచించిన మహాభారత విశిష్టత, గురువు ప్రాధాన్యతను అందరూ తెలుసుకోవాలన్నారు. అనంతరం జిల్లాస్థాయిలో విశిష్ట సేవలందించిన పెద్దలను సన్మానించారు. పదో తరగతి, ఇంటర్‌లో మెరిట్ సాధించిన బ్రాహ్మణ విద్యార్థులకు షీల్డులు, డిక్షనరీలు, నగదు బహుమతులు అందజేశారు. కారుచోల సుబ్బారావు, శ్రీనివాసరావు, శేషగిరిరావు, చంద్రశేఖర శర్మ, టి.వీరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'కోట' మృతి సినీ జగత్తుకు తీరని లోటు

యడ్లపాడు: ప్రముఖ సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతి సినీ లోకానికి, నాటక రంగానికి తీరని లోటని కొండవీటి కళాపరిషత్, పుచ్చలపల్లి సుందరయ్య కళావేదిక నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. ఆయన నటనా ప్రస్థానం అద్భుతమన్నారు. సినీ ప్రపంచంలో కోటా శ్రీనివాసరావు ఒక సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని నిర్వాహకులు కొనియాడారు. కోట శ్రీనివాసరావు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ప్రకటన చేసిన వారిలో పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు, ఉపాధ్యక్షుడు జరుగుల శంకరరావు, కార్యదర్శి ముత్తవరపు రామారావు, కోశాధికారి నూతలపాటి మాధవరావు, కాళిదాసు, సినీ దర్శకుడు జరుగుల రామారావు, సినీనటులు ముత్తవరపు పద్మారావు, కొండవీటి కళాపరిషత్ నిర్వాహకులు పరిషత్ అధ్యక్షుడు కట్టా శ్రీహరిరావు, ఉపాధ్యక్షులు తోకల సాంబశివరావు, నంబూరు వీరాంజనేయులు, కార్యదర్శి మండెపూడి శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు మల్నేని సీతారామాంజనేయులు, కనపర్తి శ్రీనివాసరావు, కోశాధికారులు కట్టా వీరాంజనేయులు, నంబూరు శివరామకృష్ణ, నంబూరు ఉల్లయ్య ఉన్నారు.

ప్రత్యేక అలంకరణలో కనక దుర్గమ్మ



పిడుగురాళ్ల: పట్టణంలోని భవానీ నగర్‌లోని శ్రీ కనక దుర్గమ్మవారిని ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అపూర్వ సంబరం.. 'ఓరియంటల్' వజ్రోత్సవం

- శ్రీ రామకృష్ణ ఓరియంటల్ హైస్కూల్‌లో అంబరాన్నంటిన వజ్రోత్సవాలు, పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- గురువులను సత్కరించుకున్న పూర్వ విద్యార్థులు



గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు



వజ్రోత్సవంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని శ్రీరామకృష్ణ ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వజ్రోత్సవం ఆదివారం శ్రీవేంకటేశ్వర కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన పూర్వ విద్యార్థులతో కళ్యాణ మండపం ప్రాంగణం కళకళలాడింది. ఎన్నో సంవత్సరాల అనంతరం కలుసుకున్న సహ విద్యార్థులు నాటి సంగతులను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. తమ కుటుంబ సభ్యులతో తరలి వచ్చి తమ చిన్ననాటి స్నేహితులను, సన్నిహితులను కుటుంబ సభ్యులకు పరిచయం చేసి మురిసిపోయారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభకు మొదటి బ్యాచ్ పూర్వ విద్యార్థి ప్రొఫెసర్ డీఏఆర్ సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. సభలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త, పూర్వవిద్యార్థుల సంఘం గౌరవాధ్యక్షుడు, రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ తదితరులు మాట్లాడుతూ, ఎంతో చరిత్ర, ప్రాధాన్యత గల ఓరియంటల్ పాఠశాల అభివృద్ధికి చేయూతనిస్తామని తెలిపారు. పాఠశాల ప్రహరీ నిర్మాణానికి తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా తమ గురువులను పూర్వ విద్యార్థులు సత్కరించి ఆశీస్సులు అందుకున్నారు. పూర్వ విద్యార్థి, ప్రస్తుత హెచ్ఎం బి.సత్యనారాయణసింగ్, జూలకంటి సీతారామాంజనేయులు, రొంపిచర్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కాకాని జెడ్పీ 'ట్రిపుల్' ధమాకా !

- పాఠశాల నుంచి స్కౌట్స్ విభాగంలో ముగ్గురికి ట్రిపుల్ ఐటీ సీట్లు
- ఈ ఏడాది మొత్తం ఎనిమిది మందికి సీట్లు



ఆర్. విఘ్నేష్



బి.ప్రభాస్



కె. అనిల్‌కుమార్

నరసరావుపేట రూరల్: కాకాని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. ఈ పాఠశాల నుంచి మొత్తం ఎనిమిది మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించగా.. వీరిలో ముగ్గురు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో సీట్లు సాధించడం విశేషం. స్కౌట్స్ విభాగంలో ఒకే పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడం రాష్ట్రంలో ఇదే ప్రథమం. తొలి విడత కౌన్సెలింగ్‌లో ఐదుగురు విద్యార్థులు పదిలో వచ్చిన మార్కులు ఆధారంగా ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించారు. స్కౌట్స్ విభాగంలో ఆదివారం విడుదల చేసిన జాబితాలో పాఠశాలకు చెందిన రావెళ్ల విఘ్నేష్(ఒంగోలు ట్రిపుల్ ఐటీ), బుట్టి ప్రభాస్, కొర్నెపాటి అనిల్‌కుమార్ (నూజివీడు ట్రిపుల్ ఐటీ)ల్లో సీట్లు సాధించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు స్కౌట్స్ విభాగంలో సీట్లు సాధిస్తున్నారు. గత ఏడాది రెండు సీట్లు, 2022–23లో ఒక సీటును ఈ విభాగంలో పాఠశాల విద్యార్థులు దక్కించుకున్నారు. హైస్కూల్ స్కౌట్ ఉపాధ్యాయుడు టి.అంజిరెడ్డి పర్యవేక్షణలో విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ సోపాన్‌తో పాటు రాజ్య పురస్కారంను విజయవంతంగా పూర్తిచేస్తున్నారు. దీంతో స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో విద్యార్థులకు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు దక్కుతున్నాయి. ఈ ఏడాది ఒకే పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు పొందడం రికార్డుగా ఉపాధ్యాయులు తెలిపారు. ట్రిపుల్ ఐటీల్లో సీట్లు దక్కించుకున్న విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.గోవిందరాజులు, స్కౌట్ మాస్టర్ టి.అంజిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న లారీ

యడ్లపాడు: జాతీయ రహదారిపై డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా రెండు లారీలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లారీలు దెబ్బతినగా, డ్రైవర్లు సురక్షితంగా బయటపడ్డారని ఎస్‌ఐ శివరామకృష్ణ వెల్లడించారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. ఒంగోలు వైపు ఇసుక లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్, జాతీయ రహదారి పక్కన తన వాహనాన్ని ఆపి నిద్రపోయాడు. అదేమార్గంలో వస్తున్న మరో ఇసుక లోడు లారీ డ్రైవర్ నిద్రమత్తు కారణంగా వాహనంపై నియంత్రణ కోల్పోయి, ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రెండు లారీలు దెబ్బతిన్నాయి. అయితే డ్రైవర్లకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివరామకృష్ణ తెలిపారు. జాతీయ రహదారులపై డ్రైవర్లు అలసటగా ఉన్నప్పుడు విశ్రాంతి తీసుకోవాలని, నిద్రమత్తులో వాహనం నడపవద్దని ఆయన సూచించారు. అయితే వాహనాలను రహదారికి దూరంగా ఉండేలా నిలుపుకుంటే ప్రమాదాలు జరగవన్నారు.

రేపు కంటి వైద్యశిబిరం

వినుకొండ: పెన్షనర్స్ ఉద్యోగుల సేవా సంఘం వారి సహకారంతో ఈ నెల 15వ తేదీన మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల, పెన్షనర్స్ సంఘం భవనంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆదివారం తెలిపింది. నంద్యాల, శాంతిరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ఈవైద్యశిబిరంలో ఈహెచ్ఎస్ హెల్త్ కార్డు, ప్రైవేట్ హెల్త్ ఇన్సూరెన్సు కార్డు, జర్నలిస్ట్ కార్డు ఉన్నవారికీ ఉచిత కంటి పరీక్షలు చేసి కంటి శుక్లం ఉన్నవారికి నంద్యాల హాస్పిటల్‌లో వారి వాహనంలో తీసుకుని వెళ్లి ఆపరేషన్ చేయించడం జరుగుతుందని సంఘం అధ్యక్షుడు భువనగిరి సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ శ్రీ కృష్ణమూర్తి, ఆర్గనైజర్ ఉరుకుందప్ప, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే సమ్మె

- డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి సమ్మె విరమింపజేయాలి
- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు



సమ్మె శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న ఉమామహేశ్వరరావు, నాయకులు

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఇంజినీరింగ్ కార్మికులు సమ్మెలోకి దిగారని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం స్థానిక మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు శనివారం అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి దిగిన విషయం విధితమే. కార్యాలయం ఎదురుగా కార్మికులు చేస్తున్న సమ్మె శిబిరాన్ని ఆదివారం ఉమామహేశ్వరరావు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని పురపాలక సంఘాల్లో ఇంజినీరింగ్ విభాగ కార్మికులు సమ్మెకు దిగారన్నారు. మొదటిరోజు జయప్రదంగా జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సానుభూతి మాటలు చెప్పకుండా అన్నీ యూనియన్లతో చర్చలు నిర్వహించి కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వంలోనే ఇంజినీరింగ్ కార్మికులకు అన్యాయం జరిగిందన్నారు. కేటగిరీలలో చేసిన నిర్ణయాలను మార్చాలని ఆనాటి నుంచే కోరుతున్నామన్నారు.
- జీఓ నంబరు 36 ప్రకారం రూ.21వేలు, రూ.24వేలు జీతం అమలయ్యేలా చూడాలన్నారు. ప్రజాఅవసరాలు తీరుస్తూ పట్టణాలను సుందరంగా ఉంచే కార్మికులకు షరతులు వర్తించకుండా ప్రభుత్వ పథకాలను అమలుచేయాలన్నారు. గత 15రోజుల సమ్మెకాలానికి జీఓలు విడుదల చేసి జీతాలు ఇవ్వకుండా ఫైనాన్స్ డిపార్టుమెంట్‌కు పంపకుండా ఫైల్స్ మొత్తాన్ని బూజుపట్టేలా చేస్తున్నారన్నారు. సమ్మెచేస్తున్న వారిపై అధికారులు చేస్తున్న జులుంకు, బెదిరింపులకు చింతకాయలు కూడా రాలవని హెచ్చరించారు. కార్మికులు తిరగబడకముందే వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులు కూడా సమ్మెలోకి దిగుతారని హెచ్చరించారు. సమానపనికి సమాన వేతనం, నాయకులను చర్చలకు పిలవాలని, మున్సిపల్ శాఖా మంత్రి జోక్యం చేసుకోవాలి, సంక్షేమపథకాలు అమలుచేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు సిలార్ మసూద్, చిన్న అల్లాభక్షు పాల్గొన్నారు.

సాగరమాత దేవాలయంలో భక్తుల సందడి



విజయపురిసౌత్: సాగరమాత ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సాగరమాత పుణ్యక్షేత్రానికి తరలి వచ్చారు. దీంతో శని, ఆదివారాల్లో భక్తుల సందడి బాగా పెరిగింది. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే సాగరమాత ఆలయంలో భక్తుల మొక్కుబడులు కోలాహలంగా సాగుతున్నాయి. ఉదయం భక్తులు కృష్ణానదిలో స్నానమాచరించి ఆలయ విచారణ గురువులు జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనికి ముందు దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఐలాండ్ సెంటర్‌లో నిరాహార దీక్ష చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

పిడుగురాళ్ల: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా పిడుగురాళ్ల పట్టణంలో ఐలాండ్ సెంటర్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె శిబిరం ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ... దశల వారీగా అనేక ఆందోళనలు చేసి, వినతి పత్రాలు అందజేసినా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి ఈ రోజు పారిశుద్ధ్య ఇంజినీరింగ్ కార్మికులను రోడ్డు మీద నెట్టిందని ఆయన విమర్శించారు. వెంటనే ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, రిటైర్మెంట్ 62 సంవత్సరాలకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, నిబంధనలు లేకుండా తల్లికి వందనం అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమస్యల పరిష్కారించాలని సమ్మె కాలుపు డిమాండ్ల అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు వేముల శ్రీనివాసరావు, మధు, పవన్‌కుమార్, రమేష్, వాసా ప్రతాప్, కాంద్రగుంట రాజు, గోవిందు పాల్గొన్నారు.

పోలేరమ్మకు పూజలు



జలబిందెలతో ఆలయానికి వెళ్తున్న గ్రామస్తులు

పిడుగురాళ్లరూరల్: సకాలంలో వర్షాలు పడాలని, పాడి పంటలు సంవృద్ధిగా పండాలని గ్రామదేవతలకు జలాభిషేకం ఆదివారం నిర్వహించారు. మండలంలోని చెన్నాయిపాలెంలో పోలేరమ్మకు, పోతురాజుకు, మహాలక్ష్మమ్మకు, బొడ్రాయి అయిన గ్రామ దేవతలకు గ్రామస్తులంతా కలిసి జలాభిషేకం నిర్వహించారు. వర్షాలు కురిపించాలని వరుణదేవుడిని వేడుకున్నారు. దైవనామ స్మరణతో ఊరు మోతమోగిపోయింది. అనంతరం మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు.

సున్నం మిల్లు కార్మికుల కూలి రేట్లు పెంచాలి

పిడుగురాళ్ల: సున్నం మిల్లు కార్మికులకు కూలి రేట్లు పెంచాలని సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని సున్నం బట్టీ కార్మికులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది ముగిసే సమయం దగ్గర పడుతుండగా సున్నపు బట్టీ కార్మికులతో సమావేశం నిర్వహించటం జరిగిందని చెప్పారు.

పెరిగిన నిత్యావసరాలను అనుగుణంగా కార్మికుల కూలి రేట్లు పెంపుదల చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ గ్రాడ్యుటీ సర్వీస్ వంటి చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలని, పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని, మహిళలకు మురుగుదొడ్లు, విశ్రాంతి గదులు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ సంఘాల అధ్యక్షులు జె. జయరాజ్, వర్కర్స్ యూనియన్‌నాయకులు యతీరాజుల శివయ్య, చిట్టిబోయిన గిరిబాబు, గురవయ్య, కాకర్ల సాంబయ్య, రామారావు, బత్తుల కొండలు, నల్లమేకల యలమంద, వెంకటేశ్వర్లు, దేవరంపాడు శ్రీను, రాంబాబు, పందిటి నాగరాజు, వెంకయ్య పాల్గొన్నారు.

గంగామహాలక్ష్మికి ఆషాఢం సారె



శాకంబరి అలంకారంలో గంగామహాలక్ష్మీ అమ్మవారు



అమ్మవారికి సారె సమర్పించేందుకు వెళ్తున్న మహిళలు

నరసరావుపేట రూరల్: ఆషాఢ మాసం ఆదివారాన్ని పురస్కరించుకొని వల్లపచెరువు సమీపంలోని గంగా మహాలక్ష్మీ దేవాలయంలో అమ్మవారికి మహిళలు సారెను సమర్పించారు. ఉదయం 8 గంటలకు పాతూరు ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి మహిళలు ఊరేగింపుగా బయలుదేరారు. అమ్మవారికి ప్రత్యేక నిర్వహించి సారె సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికిని శాకంబరి అలంకారంలో అలంకరించారు. కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారిని భక్తులు దర్శించుకొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరిద్దాం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న షేక్ దరియావలి

చిలకలూరిపేట: కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరిద్దామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి చెప్పారు. పట్టణంలోని 13వ వార్డులో వార్డు కౌన్సిలర్ షేక్ మీరాబీ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న దరియావలి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు హామీలను బాండ్ల రూపంలో ప్రజలకు అందించి నేటికీ వాటిని అమలు చేయకుండా ప్రజలను దారుణంగా మోసగిస్తున్నారని విమర్శించారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత తీవ్రంగా ఉన్న విషయాన్ని గుర్తించాలని కోరారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించే బాధ్యతను పార్టీ నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలని చెప్పారు. త్వరలో మాజీ మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో నిర్వహించనున్న బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పూడ్చని గుంతలు.. తప్పని తిప్పలు



గ్రామంలో పైపులైన్ నిర్మాణం నిమిత్తం తీసిన గోతులు

రొంపిచర్ల: గుంతలు తీశారు.. పూడ్చటం మరిచారు.. ఆ గుంతల్లో పడి ప్రజలు, పశువులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారే లేరు. ఈ పరిస్థితి మండలంలోని మాచవరం గ్రామంలో నెలకొంది. జలజీవన్ మిషన్‌లో భాగంగా మాచవరం గ్రామంలో మంచినీటి సరఫరా చేసేందుకు పైప్‌లైన్ ఏర్పాటుకు నెల రోజుల క్రితం వీధి వీధిలో గుంతలు తీశారు. కొన్ని వీధుల్లో రోడ్డుకు ఒకవైపు తీయగా, రోడ్లు క్రాస్ అయ్యే చోట సిమెంట్ రోడ్లు సైతం అడ్డుగా పగుల గొట్టారు. పైపులైను నిర్మాణానికి రోడ్లు పగులగొట్టడం.. పైపులైను వేయటం తప్పనిసరి. అయితే తీసిన గోతుల్లో పైపులైన్లు ఏర్పాటు చేసినా వాటిని పూడ్చకపోవటంతో గ్రామస్తుల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. గోతులతో నిండిన రోడ్లపై ద్విచక్ర వాహనాల సైతం నడిపేందుకు ఇబ్బందిగా మారింది. మేతకు తీసుకెళ్లే పశువులు ఇందులో పడిన సందర్భాలు ఉన్నాయి. పైపులైన్ ఏర్పాటు పూర్తయింది కాబట్టి గోతులు పూడ్చి రోడ్లకు మరమ్మతులు నిర్వహించి, ఇబ్బందులు తొలగించాలని ఆశాఖ అధికారులను మాచవరం గ్రామస్తులు కోరుతున్నారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గం

నరసరావుపేట: స్థానిక వినుకొండ రోడ్‌లోని రోటరీ కమ్యూనిటీ హాలులో నరసరావుపేట రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. దీనికి ముఖ్య అతిథులుగా జిల్లా గవర్నర్ నామినీ ఎం.హరిహరప్రసాద్ అసిస్టెంట్ గవర్నర్ పి.రాఘవయ్య పూర్వ కార్యవర్గ ప్రెసిడెంట్ కపిలవాయి రాజేంద్రప్రసాద్, సెక్రటరీ సాతులూరి శివకుమార్, గవర్నర్లు కేపీ రంగారావు, తాళ్ల రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన క్లబ్ అధ్యక్షుడు షేక్ కరీం మొహిద్దిన్, సెక్రటరీ భవనం పునీందర్‌రెడ్డి, ట్రెజరర్ కట్టమూరి ఆంజనేయులు, డైరెక్టర్లు షేక్ జిలాని మాలిక్, పి.శివనాగరాజు, సీహెచ్ నాగలక్ష్మి సునీత, జమ్ముల రాధాకృష్ణ, వేమా వెంకటేశ్వరరావు, పోటు అచ్యుత్, పాశం కృష్ణారావు, పులిపాటి రమేష్, లింగ ఆంజనేయులుచే ప్రమాణస్వీకారం చేయించారు. పాస్ట్ ప్రెసిడెంట్ మేళ్లచెరువు వీరాంజనేయులు, చేకూరి సాంబశివరావు, రాయల శ్రీనివాసరావు, మామిడి సుబ్బారావు, మురారిశెట్టి వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మీరావలి, ఈశ్వర్ ఇంజినీరింగ్ కాలేజ్ సెక్రటరీ షేక్ మస్తాన్ షరీఫ్ పాల్గొన్నారు.

చదరంగంతో మెదడుకు పదును..



విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తున్న కోచ్ కిరణ్, ఆంజనేయులు

మాచర్ల రూరల్: చదరంగం మెదడుకు పదునుపెడుతుందని, దీని ద్వారా పనితీరు మెరుగుపర్చుకోవచ్చునని పల్నాడు చెస్ అకాడమీ అధ్యక్షుడు కె.కిరణ్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పల్నాడు జిల్లా అండర్–13 ఓపెన్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. చదరంగం క్రీడ వలన విద్యార్థులలో చురుకుదనాన్ని పెంపొందించటమే కాకుండా మానసిక ఒత్తిడులను ఉపశమనం పొందవచ్చునని పేర్కొన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి చదువుతో పాటు తమకు నచ్చిన విభాగాల్లో ఆటలు, పాటలు క్రీడలు వంటి పోటీలో పాల్గొనటం ద్వారా వారనుకున్న గోల్ సాధించగలరని చెప్పారు. యూనివర్సల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆవుల వీరాంజనేయులు మాట్లాడుతూ వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో పల్నాడు చెస్ అకాడమి స్థాపించి వందలాది మంది విద్యార్థులకు చదరంగం క్రీడలను నేర్పిస్తూ రాష్ట్ర స్థాయిలో విద్యార్థులకు బహుమతులు అందేలా తర్ఫీదు ఇస్తున్న కోచ్ కిరణ్ సేవలు అమూల్యమన్నారు. అనంతరం బాలురు, బాలికల విభాగాలలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన కేఎస్ మోజెస్, కేజే మేగ్నెస్, బి.మేఘ శ్రీ, కోమలి, ఎం.శ్రావ్యకు బహుమతులు అందించారు. గెలుపొందిన నలుగురు ఆగస్టు 2,3, తేదీలలో మచిలీపట్నంలో జరిగే అండర్–13 రాష్ట్ర స్థాయిలో పోటీలలో జిల్లా నుంచి ప్రాధాన్యం వహిస్తారని కోచ్ కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో సంబరాసు వేణు, బి.పాపారావు పాల్గొన్నారు.